క్లుప్తంగా

దీపావళితో కొత్త వెలుగులు

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్




పుంగనూరు: దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలసి జాగ్రత్తగా టపాకాయలు కాల్చాలని, అందరి కుటుంబాల్లో కొత్త వెలుగులతో ఆనందం వెల్లి విరియాలని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

డీఎంగా గోపినాథ్



కుప్పం: కుప్పం ఆర్టీసీ కొత్త డిపో మేనేజర్‌గా గోపినాథ్ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ సెంట్రల్ ఆఫీస్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. కుప్పం డీఎంగా పనిచేస్తున్న పెంచులయ్య వాకాడు డిపోకు బదిలీ అయ్యారు. గోపినాథ్‌ను ఆర్టీసీ యూనియన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

పుంగనూరు: ఎస్సీ, ఎస్టీ కమిటీ మానిటరింగ్ సమావేశాన్ని బుధవారం తన కార్యాలయంలో తహసీల్దార్ రాము నిర్వహించారు. సభ్యులు ఎస్సీ, ఎస్టీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హరిత దీపావళి చేసుకుందాం



విద్యార్థులు నిర్వహిస్తున్న ర్యాలీ

కల్లూరు(పులిచెర్ల): కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నేషనల్ గ్రీన్ కోర్-ఎకో క్లబ్ కన్వీనర్ రాజేంద్ర, గ్రీన్‌మాస్టర్ వెంకట సిద్దులు విద్యార్థులతో హరిత దీపావళిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మట్టి ప్రమిదలతో పర్యావరణ హిత దీపావళి జరుపుకోవాలని, శబ్ద, వాయు కాలుష్యాలు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. పండుగ పూట ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీవాణి, రాజశేఖర్, వెంకటరమణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై 77 వినతులు



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌డీటీ రమేష్

పెద్దపంజాణి: మండలంలోని పెద్దవెలగటూరులో రీ-సర్వేపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. సభలో మొత్తం 77 మంది రైతులు తమ సమస్యలపై అధికారులు అర్జీలు ఇచ్చారు. సభలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రమేష్ మాట్లాడారు. రైతులు తమ దృష్టికి ఫిర్యాదుల రూపంలో తీసుకువచ్చిన సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రీసర్వేలో తలెత్తిన భూ సమస్యలను పరిష్కరించేందుకే ఈ గ్రామసభలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సాయిరాజ్, నాయకులు నాగిరెడ్డి, శ్రీరాములు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ




దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్మన్, కమిషనర్

పుంగనూరు: అహర్నిశలూ ప్రజారోగ్యం కోసం పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు అన్ని విధాలా అండగా ఉంటామని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మధుసూదన్‌రెడ్డితో కలసి కార్మికులకు దుస్తులు, కొబ్బరి నూనె, పాదరక్షలు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచడంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. ఎంతచేసినా వారి రుణం తీర్చుకోలేమని వారి సేవలను ప్రస్తుతించారు.

నియామకం



సుభాష్



రమేష్

రొంపిచెర్ల: ఏపీ ఎస్సీ, ఎస్టీ పోరాట కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గానుగచింతకు చెందిన బండపల్లె సుభాష్‌ను, అలాగే పుంగనూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా బొమ్మయ్యగారిపల్లెకు చెందిన బి.రమేష్‌ను నియమిస్తూ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బుల్లా రాజారావు నియామక పత్రం పంపారు. ఎస్సీ, ఎస్టీ కులాల అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామని సుభాష్, రమేష్ తెలిపారు.

దీపావళి మట్టి ప్రతిమలు

ఆకట్టుకుంటున్న టెర్రకోట కళాకృతులు

- కోల్‌కత్తా నిపుణుల ప్రత్యేక శిక్షణతో తయారీ
- ఆకర్షిస్తున్న కుందన్‌లు, దేవుడి విగ్రహాలు, కార్తీక దీపాలు





టెర్రకోట కళాకారులు దీపావళి కోసం ఆకర్షణీయంగా తయారు చేసిన మట్టి ప్రతిమలు

పలమనేరు: దీపావళి అనగానే మనకు గుర్తుచ్చేది మట్టి ప్రమిదల్లో వెలిగే దీపాలు. విజయానికి చిహ్నంగా జరుపుకునే ఈ పండగకు దీప కాంతులే ప్రత్యేకత. పండుగను దృష్టిలో ఉంచుకొని స్థానిక గంటావూరు టెర్రకోట హస్తకళాకారులు రకరకాల డిజైన్లలో దీపావళి మట్టి ప్రతిమలను సిద్ధం చేశారు. ప్రమిదలు, చంకీ ప్రమిదలు, కుందన్‌లు, దొంతులు, దేవుడి మట్టి విగ్రహాలు.. ఇలా పండగకు వాడుకోవడంతోపాటు బంధువులు, స్నేహితులకు కానుకగా ఇచ్చేందుకు సైతం ఇవి ఆకర్షణీయంగా ఉండడంతో కొనుగోలు వాటి వైపు వాలిపోతున్నారు.

నెల రోజుల నుంచి తయారీ

మారుతున్న ట్రెండ్‌ను బట్టి కొత్త డిజైన్లతో ప్రతిమలను ఇక్కడ నెల రోజుల నుంచే తయారు చేశారు. కొల్‌కత్తా నుంచి వచ్చిన ప్రత్యేక శిక్షకులు ఇక్కడి టెర్రకోట కళాకారులకు వీటిపై శిక్షణనిచ్చి వెళ్లారు. దీంతో వందలసంఖ్యలో డిజైన్లను వీరు అద్భుతంగా తయారు చేశారు. టెర్రకోటతో ఇప్పటిదాకా తయారవుతున్న వస్తువులు, కళాకృతులతోపాటు పశ్చిమ బెంగాల్, ఒడీశా రాష్ట్రంలో తయారయ్యే వస్తువులు, అక్కడి డిజైన్లను సమ్మిళితం చేసి మరింత విభిన్నంగా ప్రతిమలను తయారు చేశారు. ఇక్కడ వంద కుటుంబాలు పలు రకాల మట్టి బొమ్మలను తయారు చేస్తున్నాయి. ఈ కుటుంబాలకు మరింత చేయూతనందించే దిశగా డీఆర్‌డీఏ అధికారులు గంటావూరు సమీపంలో రూ.2కోట్లతో టెర్రకోట హబ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నాచారం టెర్రకోట హోల్‌సేల్ ప్రతిమల కంటే ఇక్కడ కారుచౌకగా దీపాలు లభిస్తున్నాయి. వీటి ధరలు సైతం సామాన్యునికి అందుబాటులో రూ.20 నుంచి రూ.150 వరకూ ఉన్నాయి. ఇక్కడ హోల్‌సేల్‌గానూ రీటైల్‌గానూ ప్రతిమలను విక్రయిస్తున్నారు. పండగ సందడి మొదలవడంతో ప్రతిమల కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి.

వందలాది డిజైన్లు

దీపావళి మట్టి ప్రతిమల్లో 40కి పైగా రకాలు, కుందన్‌లు, కలర్‌ఫుల్ దొంతులు, వేలాడే దీపాలు, జంతువులు, దేవుళ్ల బొమ్మలు ఉన్నాయి. ముఖ్యంగా లక్ష్మీపూజకు అవసరమయ్యే మట్టి వస్తువులు, కార్తీక మాస ప్రత్యేక పూజలకు ప్రతిమలను తయారు చేశారు. వీటిని జాగ్రత్తగా తీసుకెళ్లేందుకు ప్యాకింగ్ సైతం చేసి ఇస్తున్నారు. ప్రమిదల కోసం స్థానికులే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి ఎక్కువగా కూడా పలమనేరుకు వస్తుండటం గమనార్హం! దీంతోపాటు దేశంలోని పలు రాష్ట్రాల వ్యాపారులు ఇప్పటికే ప్రతిమలను ఆయా రాష్ట్రాలకు తీసుకెళ్లారని ఇక్కడి హస్త కళాకారులు తెలిపారు.

కొత్త డిజైన్లకు మంచి ఆదరణ

ఆధునికత పండగ వ్యవహారాల్లో ఎన్ని మార్పులు తెస్తున్నా దీపావళికి ఇప్పటికీ సంప్రదాయబద్ధంగా ఇళ్లలో మట్టి ప్రమిదలు వాడుతున్నారు. సాధారణ మట్టి ప్రతిమలతోపాటు ఉత్తరాది రాష్ట్రాల డిజైన్లను కలిపి కొత్తగా ఈసారి మట్టి ప్రతిమలను, కుందన్‌లను తయారు చేశాం. వీటికి మంచి ఆదరణ లభిస్తోంది. డిజైన్లు బాగా నచ్చి ఎక్కువమంది వీటిని కొనుగోలు చేస్తున్నారు.

–రామకృష్ణ,
టెర్రకోట హస్త కళాకారుల అసోసియేషన్ నాయకుడు, పలమనేరు






దీపావళి కొనుగోళ్ల సందడి



బీఎంఎస్ క్లబ్‌లో టపాకాయల దుకాణాలు

పుంగనూరు: దీపావళి పండుగ పురస్కరించుకుని పట్టణంలోని బీఎంఎస్ క్లబ్‌లో టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేశారు. అలాగే ఎంబీటీ రోడ్డులో నోముదారాలు, లక్ష్మీకాసులు వెండి, బంగారుతో చేసిన కాసుల విక్రయాలతోపాటు పూజలకు అవసరమైన వాటి కొనుగోళ్లు జోరుగా సాగాయి. టపాకాయల ధరలు అధికంగా ఉండడంతో వ్యాపారం మందకొడిగా సాగుతోంది. ఇక, వివిధ వస్తువుల కొనుగోలు నిమిత్తం గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణానికి రావడంతో అంతటా సందడిగా కనిపించింది.

● ఆయుధ పూజ



పూజా కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఈఓ, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది

వి.కోట: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ పిఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో ఆయుధ పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలోని అన్ని పనిముట్లు, వాహనాలకు డంపింగ్‌యార్డ్ వద్ద ప్రత్యేకంగా పూజలు చేశారు. పంచాయతీ సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఈఓ శివశంకర్, వార్డు సభ్యులు కుమార్‌రాజా, మంజుల, వేణుచారి, ఖలీల్ ఖాదర్, విజయమ్మ, సిబ్బంది బాబన్న, పృథ్వీ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: స్థానిక తహసీల్దార్, పోలీస్ స్టేషన్లలో బుధవారం ఆయుధ పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యాలయాలను పచ్చటి తోరణాలతో అలంకరించారు. అనంతరం వాహనాలకు పూజలు చేశారు.

● ఆత్మీయత



మాజీమంత్రి పెద్దిరెడ్డిని కలిసిన పలమనేరు నేతలు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం మాజీమంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన నివాసంలో ఆత్మీయ పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ వారిపై దాడులు, తప్పుడు కేసులు ఇత్యాది వాటిపై ఆయనతో చర్చించినట్టు తెలిపారు. కలిసిన వారిలో బైరెడ్డిపల్లె, పలమనేరు మాజీ ఎంపీపీలు శ్రీనివాసులు రెడ్డి, రాజేంద్రన్, యువ నాయకులు సుహేబ్, మంజునాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో రాష్ట్రీయ ఏక్తా దివస్



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, అధ్యాపకులు



గుడుపల్లెలో..

పలమనేరు: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు బుధవారం రాష్ట్రీయ ఏక్తా దివస్ నిర్వహించారు. గుడియాత్తం రోడ్డులో అవగాహన ర్యాలీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బాబు మాట్లాడుతూ, దేశ సమైక్యత కోసం వల్లభాయ్ పటేల్ ఎనలేని సేవలు చేశారని కీర్తించారు.

గుడుపల్లె: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు.వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను కీర్తించారు. అనంతరం కళాశాల నుంచి క్రాస్ మీదుగా గుడుపల్లె వరకు ర్యాలీ చేశారు. గుడుపల్లె ఆర్టీసీ బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామకృష్ణమనాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

- జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్ రెడ్డి



ప్రసంగిస్తున్న మధుసూదన్ రెడ్డి

రొంపిచెర్ల: పండ్ల తోటల పెంపకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఉద్యానవన శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. మామిడి, టమాట పంటలపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మామిడి తోటలలో కాయలు కోసిన తర్వాత కొమ్మలను కత్తిరించాలని, చెట్ల వయస్సును బట్టి తగినంత ఎరువు వేయాలన్నారు. మామిడి పూత రావడానికి 13.0.45 (మల్టీ కే) మందును లీటరుకు 8 గ్రాముల వంతున పిచికారీ చేయాలన్నారు. అలాగే అర్కా మాంగో స్పెషల్ ఐఐహెచ్‌ఆర్ బెంగళూరు మందును లీటరుకు 8 గ్రాముల వంతున పిచికారీ చేస్తే పూత బాగా నిలబడుతుందని, టమాట పంటకు కూడా మందులు ఎలా పిచికారీ చేయాలో వివరించారు. శాస్త్రవేత్త పీరూసాహెబ్, ఉద్యానశాఖాధికారిణి సంతోషికుమారి, రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిలు నరసింహులు, వెంకటరమణా నాయక్, శ్రావణి, నర్మద, సుబ్రమణ్యం, రేఖ పాల్గొన్నారు.

టపాసుల రేట్లు ఢాం..ఢాం..!

- పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ధర అధికం
- ఇక్కడ సిండికేట్ అయిన బాణసంచా వ్యాపారులు
- తమిళనాడుకు వెళ్లి తక్కువ ధరకు టపాసులు కొంటున్న ప్రజలు



గంటావూరు వద్ద ఉన్న టపాసుల దుకాణాలు

పలమనేరు: దీపావళి అంటే ఎక్కడైనా టపాసుల మోతే ప్రధానం. అయితే పలమనేరులో గత ఏడాదితో పోల్చితే ఈసారి టపాసుల ధరలు మరింత పెరిగిపోయాయి. స్థానికంగా గంటావూరు వద్ద 20కి పైగా టపాసుల దుకాణాలను ఏర్పాటు చేశారు. అయితే వ్యాపారులు సిండికేట్ కావడంతో ధరలు పేలుతున్నాయి. మరోవైపు పొరుగునే ఉన్న తమిళనాడులో టపాసుల ధర తక్కువగా ఉండడం, పలమనేరుకు తమిళనాడులోని గుడియాత్తం 30 కిలోమీటర్ల దూరంలోనే ఉండడంతో అక్కడికెళ్లి ప్రజలు టపాసులను కొనుగోలు చేస్తున్నారు.

అగ్నిమాపక శాఖ నిబంధనలు గాలికి...

సాధారణంగా టపాకాయల దుకాణానికి మరో దుకాణానికి మధ్య విధిగా 9 అడుగుల దూరం ఉండాలి. అయితే ఇక్కడ టపాకాయల దుకాణాలు పెట్టిన స్థలం తక్కువగా ఉండడంతో వ్యాపారులు మూడు అడుగుల దూరంతోనే దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతోపాటు ప్రతి దుకాణం వద్ద విధిగా మంటలను ఆర్పే యంత్రం, ఫైర్ బకెట్, వాటర్‌గ్యాస్, ఇసుక మొదలైనవి ఉండాలి. కానీ ఇక్కడ చాలా దుకాణాల వద్ద ఇవేవీ కనిపించడం లేదు.

గిరిజన మైనర్ బాలిక కిడ్నాప్ కేసులో నిర్లక్ష్యమేల?

పలమనేరు: మండలంలోని ముసలిమొడుగు సమీపంలోని ఏటిగడ్డకు చెందిన మైనర్ గిరిజన బాలికను అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు కిడ్నాప్ చేసి నాలుగురోజులవుతున్నా పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని జిల్లా మాలమహానాడు నాయకుడు చంద్రకుమార్ బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఇక్కడి పోలీసులు రూరల్ మండలానికి చెందిన ఓ టీడీపీ నేత ఒత్తిళ్ల కారణంగా నిందితునిపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేంతవరకు తాము అండగా నిలబడతామని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు రొంపిచెర్ల బాలికలు



విద్యార్థినులు అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రొంపిచెర్ల: రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఇద్దరు ఎంపిక అయ్యారు. తిరుపతి జిల్లా పంగూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో స్థానిక విద్యార్థినులు నవ్యశ్రీ, మేఘన రాణించారు. వీరి ప్రతిభ గుర్తించి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర పోటీలకు ఎంపిక చేసిందని హెచ్‌ఎం లక్ష్మీదేవి తెలిపారు. 9వ తరగతి చదువుతున్న నవ్యశ్రీ అండర్-17 , మేఘన అండర్-14 విభాగాలలో ఖో-ఖో పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వారిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ప్రమాదాలకు తావివ్వకుండా దీపావళి

గంగవరం: ప్రమాదాలకు తావివ్వకుండా టపాసులు దీపావళి పండుగను ప్రజలు జరుపుకోవాలని గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ బుధవారం తెలిపారు. దండపల్లె కురప్పల్లె వద్ద బాణసంచా గోదాము నిర్వాహకులకు మాత్రమే టపాకాయల విక్రయాలకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు.

ద్విచక్రవాహనాలు ఢీ: ముగ్గురికి గాయాలు

రామకుప్పం: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు గాయపడిన సంఘటన బుధవారం మండలంలోని బందార్లపల్లె సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. వీ.కోట మండలం పట్రపల్లె కొత్తూరుకు చెందిన సురేంద్ర(21),పంద్యాలమడుగుకు చెందిన భాస్కర్(15) ద్విచక్రవాహనంలో రామకుప్పం నుంచి పల్లికుప్పంకు బయలుదేరారు. అలాగే పల్లికుప్పంకు చెందిన హేమాద్రి(15) పంద్యాలమడుగు నుంచి రామకుప్పం వైపు ద్విచక్రవాహనంలో వస్తుండగా మార్గమధ్యంలోని బందార్లపల్లె చెరువు కట్ట సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో ముగ్గురికీ గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వారికి ప్రథమ చికిత్స చేసి కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు.

సంతూరులో 'పొలం పిలుస్తోంది'



కంది పంటను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

శాంతిపురం: మండలంలోని మఠవ పంచాయతీ సంతూరులో బుధవారం వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగులో విత్తనశుద్ధి, సమగ్ర సస్య రక్షణ ఆవశ్యకతను రైతులకు వివరించారు. రాగి, మొక్కజొన్న, కంది, పూల తోటలను పరిశీలించి రైతులకు సలహాలు-సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అప్పోజి, హార్టికల్చర్ అధికారి వింధ్య, రైతు సమాచార కేంద్ర ఇన్‌చార్జ్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సమన్వయ కృషి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు

చౌడేపల్లె: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు కొత్తగా వచ్చిన అధికారులందరూ ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు ఎన్. దామోదరరాజు కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రామమూర్తి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దామోదరరాజు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అర్హులందరికీ చేరవేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ, ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం, సెలవు రోజుల్లో వైద్యసేవలందక ప్రజలు, రోగులు ఇబ్బందులు పడుతున్నారని, వైద్యులు తీరు మార్చుకోవాలని, పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎవరినీ ఉపేక్షించేది లేదని మండిపడ్డారు. అనంతరం శాఖల వారీగా ప్రగతిని మండల స్థాయి అధికారులు నివేదించారు. సమావేశానికి ఎక్సైజ్, ఆర్టీసీ, అటవీశాఖ అధికారులు డుమ్మా కొట్టారు. వీరికి మెమో జారీ చేస్తున్నట్లు ఎంపీడీఓ లీలామాధవి తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, తహసీల్దార్ హనుమంతునాయక్, ఎంఈఓ కేశవరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

నర్సరీలపై విద్యార్థులకు అవగాహన



నర్సరీని పరిశీలిస్తున్న విద్యార్థులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అగ్రికల్చర్ ఒకేషనల్ విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా నర్సరీలపై అవగాహన కల్పించేందుకు బుధవారం టీఎస్ అగ్రహారంలోని పలు నర్సరీలకు తీసుకెళ్లారు. నర్సరీలలో పెంచిన నారు నాటడంతో పంట నాణ్యంగా పెరిగి, మంచి దిగుబడులనిస్తుందని టీచర్లు వారికి వివరించారు. కార్యక్రమంలో అభిలాష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడూరులో 'ఫ్యామిలీ ఫిజీషియన్'



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

గంగవరం: మండలంలోని ఏడూరులో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులు తన సిబ్బంది కలిసి నిర్వహించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు.